క్లుప్తంగా

విద్యార్థులకు పోటీలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలోని శ్రీపద్మావతి కల్యాణ మండపం వేదికపై ఆదివారం జూనియర్స్, సీనియర్స్ విద్యార్థులకు జానపద బృంద నృత్య పోటీలు, వ్యాస రచన పోటీలు, మహాభారతంలోని భీముని పాత్రపై అవగాహన రాత పరీక్షలు నిర్వహించారు. సంస్కార భారతి అధ్యక్షులు ఇండ్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో విజేతలకు వచ్చేనెల 26న బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన టీటీడీ బోర్డు సభ్యుడు




నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి ఆదివారం టీటీడీ బోర్డు సభ్యుడు, నాట్కో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు నన్నపనేని సదాశివరావు, జీజీహెచ్‌లోని పాదిలి ప్రసాద్ బ్లాక్ దాత డాక్టర్ పాదిలి ప్రసాద్, నాట్కో ట్రస్ట్ కో-ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్ శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీవారి శేషవస్త్రాలతో సత్కరించి ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, మైరెన్ ఇంజనీర్ లింగా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బెదిరించిన నిందితులపై కేసు

లక్ష్మీపురం: న్యాయస్థానం ఉత్తర్వులు ఉన్నప్పటికి 21 గజాల స్థలంలో కొందరూ గోడను కూల్చి ఓ మహిళను హతమార్చుతానని బెదిరించిన ఘటనలో పట్టాభిపురం పోలీసులకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. బ్రాడీపేట ప్రాంతానికి చెందిన ఓబులాపురం నాగేంద్రం అనే మహిళకు చెందిన 21 గజాల స్థలానికి సంబంధించి న్యాయస్థానం నుంచి ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నా ఆదివారం కొందరూ అక్రమంగా ప్రవేశించి గోడను కూల్చారు. అంతటితో ఆగకుండా అడ్డుకునే యత్నం చేసిన బాధితురాలు నాగేంద్రంతో అసభ్యకరంగా ప్రవర్తించి అడ్డు వస్తే హతమార్చుతామని బెదిరించారు. దీంతో దిక్కుతోచక బాధితురాలు నాగేంద్రం పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



లక్ష్మీపురం: ఆస్తి విషయంలో తల్లి, కుమార్తె మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో క్షణికావేశంలో ఇద్దరు కిరోసిన్ పోసుకుని గురువారం ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనలో ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో చికిత్స పొందుతూ తల్లి ఆదివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఈనెల 12వ తేదీన గురువారం ఏటీ అగ్రహారంలో 17వ లైన్ ప్రాంతానికి చెందిన పుచ్చం సుబ్బులు, భర్త నరసిరెడ్డి, దినం పూర్తిఅయిన మరుసటి రోజు గురువారం పెద్ద కుమార్తె కొత్తపల్లి రమణ, తల్లి సుబ్బులు మధ్య ఆస్తి వివాదం చోటుచేసుకుంది. క్షణికావేశంలో తల్లి, కుమార్తె ఇద్దరు కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. ఇద్దరిని జీజీహెచ్‌కు తరలించారు.అయితే కుమార్తె రమణ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా తల్లి సుబ్బులు(65) మాత్రం ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న నగరంపాలెం పోలీసులు ఆస్పత్రికి చేరుకుని మృతురాలి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి పోస్ట్ మార్టంకు తరలించారు.

ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డు విస్తరణలో కదలిక

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో మొదలైన పనులు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిలిచిన విస్తరణ పనులు
- 80 అడుగుల రోడ్డుగా నిర్మాణం చేపట్టిన గత ప్రభుత్వం
- నగరపాలక సంస్థ పాలకవర్గం చొరవతో పనులు





శరవేగంగా జరుగుతున్న ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డు విస్తరణ పనులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించడంతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో చేపట్టిన రహదారి విస్తరణ పనులు నగరపాలక సంస్థలోని పాలకవర్గం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పశ్చిమ నియోజకవర్గంలోని ప్రధాన ప్రాంతాల్లో ఒకటైన ఆనంద తీర్థ(ఏటీ) అగ్రహారం మెయిన్‌రోడ్డును 80 అడుగుల ప్రధాన రహదారిగా విస్తరిస్తూ గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. నవంబర్, 2022లో పనులు ప్రారంభించింది. అగ్రహారం జీరో లైను నుంచి చుట్టుగుంట సెంటర్ వరకు 1.2 కిలోమీటర్ల మేరకు 80 అడుగుల రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన గత ప్రభుత్వం సగానికిపైగా పనులు పూర్తి చేసింది. కాలువలు, డివైడర్ నిర్మాణం కాకుండా రూ.5.6 కోట్లను రహదారి నిర్మాణ పనులకే కేటాయించారు. విస్తరణకు అడ్డుగా ఉన్న 208 నిర్మాణాలను తొలగించాలని నోటీసు చేసిన అధికారులు భవన యజమానులను ఒప్పించి, నిర్మాణ పనులు చేపట్టారు. చుట్టుగుంట సెంటర్ నుంచి ఎస్‌కేబీఎం నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల వరకు రెండు లైన్ల గ్రావెల్‌రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో పాటు డివైడర్‌ను నిర్మించారు. ఏడో లైను నుంచి జీరో లైను వరకు రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్, కాలువల నిర్మాణాలను చేపడుతున్నారు.

గత ప్రభుత్వ పాలనలో 50 శాతం పనులు పూర్తి..

గత ప్రభుత్వ పాలనలో కేవలం 15 నెలల కాలంలోనే 50 శాతానికిపైగా పూర్తి చేసింది. ఇందులో రహదారి నిర్మాణం, డివైడర్ల నిర్మాణం మూడొంతులు పూర్తవగా, సార్వత్రిక ఎన్నికల అనంతరం మిగిలిన భాగాన్ని పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు విస్తరణ పనులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జాప్యం చేస్తోందని, గత ఎన్నికల సమయంలో రాజకీయ ఆరోపణలు చేసిన గల్లా మాధవి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఇటువైపు కన్నెత్తి చూడలేదు. ఎన్నికల్లో లబ్ధి కోసం రాజకీయ ఆరోపణలు చేసిన మాధవి, ఎమ్మెల్యేగా గెలిచాక ప్రజలకు అండగా నిలబడి, రోడ్డు విస్తరణ పనులపై దృష్టి సారించిన దాఖలాలు లేవు.

పున: ప్రారంభమైన విస్తరణ పనులు

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిన రోడ్డు విస్తరణ పనులు పునః ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వ పాలనలు కేవలం 15 నెలల కాలంలోనే రోడ్డు విస్తరణకు సంబంధించిన పనులు ఓ కొలిక్కి రావడంతో పాటు కాలువల నిర్మాణం, విద్యుత్ స్తంభాల తరలింపు, కొత్త స్తంభాల ఏర్పాటు పనులు చకచకా ప్రారంభించారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగింది. ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయడం ద్వారా 50 వేల మంది ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరే అవకాశం ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండి ఉంటే రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి, ప్రజల ఇబ్బందులు తొలగిపోయేవి. ప్రజలకు ఏదో చేస్తామని హామీలు గుప్పించిన కూటమి నేతలు రోడ్డు విస్తరణపై దృష్టి సారించాలి. వైఎస్సార్ సీపీ పాలకవర్గ హయాంలో ప్రస్తుతం విస్తరణ పనులు జరుగుతున్నాయి.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

లక్ష్మీపురం: బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య గ్రంథాలయ వ్యవస్థాపకుడు లంకా సూర్యనారాయణకు హాస్యనటుడు రమణారెడ్డి జీవిత చరిత్ర పుస్తకాన్ని సెంట్రల్ ఎక్సైజ్ విశ్రాంత సూపరింటెండెంట్ గుమ్మడి సీతారామయ్య చౌదరి ఆదివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇంకా మార్కెట్ లోకి రాని ఈ పుస్తకాన్ని నెల్లూరు కు చెందిన ఉదయగిరి ఫయాజ్ రచించారని తెలిపారు. సినీ రంగంలో ఎన్నో విభిన్న పాత్రలు పోషించిన రమణారెడ్డి జీవిత చరిత్ర భావితరాలకు తెలియాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని అన్నమయ్య గ్రంథాలయానికి అందజేశామన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు సుహాసిని, అక్కినేని ఫ్యాన్స్ అధ్యక్షుడు పి.సూరిబాబు పాల్గొన్నారు.

దంతాల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

లక్ష్మీపురం: మన శరీరంలో గుండె, ఊపిరితిత్తులు మాదిరిగా పళ్లు కూడా చాలా ముఖ్యమని అవి సరిగ్గా లేకుండా ఉంటే మనం తీసుకునే ఆహారం జీర్ణమయ్యే విషయంలో సమస్యలు తలెత్తుతాయని ప్రముఖ దంత వైద్యనిపుణులు డాక్టర్ టి.హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. అరండల్ పేటలోని అవగాహన కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన ఆదివారం దంత సమస్యలపై ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ హర్షవర్ధన్ అవగాహన సభ్యులు అడిగిన దంత సమస్యలకు సంబంధించిన సందేహాలు నివృత్తి చేశారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుభాని, రిటైర్డ్ ఉపాధ్యాయులు లక్ష్మా రెడ్డి, అవగాహన సీనియర్ సభ్యులు విద్యాధర కుమార్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టాలి



భవన కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రెయిన్లపై నిర్మాణాలు చేయకుండా, డ్రెయినేజీ లైన్‌ని మేజర్ డ్రెయిన్‌లోకి కనెక్ట్ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) జారీ చేయబోమని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం కమిషనర్ గోరంట్ల, రెడ్డిపాలెం ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, సెట్ బ్యాక్, రోడ్ల కొలతలు, ర్యాంపులను తనిఖీ చేసి, తదుపరి అనుమతులకు సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నామని పేర్కొన్నారు. భవనాలు నిర్మాణ దశలోనే వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిరంతరం పరిశీలిస్తూ, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టకుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రెయిన్ల ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే నిర్మాణం చేసిన వాటిని తొలగించాలని స్పష్టం చేశారు. ప్రధానంగా సెట్ బ్యాక్ పోర్షన్‌లో ఏ విధమైన నిర్మాణాలు చేయకూడదని, జనరేటర్లు పెట్టడానికి వీలు లేదన్నారు. గ్రీనరీకి ప్లాన్‌లో చూపిన విధంగా ఉండాలన్నారు. వాచ్ మెన్ రూమ్ నగరపాలక సంస్థ నుండి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్ నిర్వాహకులే డ్రెయినేజీ లైన్‌ను మేజర్ డ్రెయిన్ వరకు కనెక్ట్ చేసుకోవాలన్నారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ మల్లికార్జున, టీపీఎస్ లక్ష్మణ స్వామి, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదలకు నెలవారీ పెన్షన్ పంపిణీ



పేదలకు పెన్షన్, నూతన వస్త్రాలు అందజేస్తున్న చంద్ర భాస్కరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) కార్యాలయంలో ఆదివారం 108 మంది పేదలకు నెలవారీ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, వసతి, పేదలకు పెన్షన్లు పంపిణీ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. తుమ్మలపల్లి చంద్ర భాస్కరరావు మాట్లాడుతూ ప్రతి నెలా 108 మంది పేదలు, వృద్ధులకు రూ.500 చొప్పున పెన్షన్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని, పెన్షన్లు అందుకున్న వారందరికీ నూతన వస్త్రాలు బహూకరించారు. అనంతరం మట్టుపల్లి రవికుమార్ ఆర్థిక సహకారంతో ఒక పేద విద్యార్థినికి సైకిల్, మరో విద్యార్థినికి కళాశాల ఫీజు రూపంలో రూ.12 వేలు అందజేశారు. కార్యక్రమంలో అరవపల్లి వెంకటేశ్వర్లు, అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, ఊటుకూరి నాగేశ్వరరావు, రమణానంద్, వరప్రసాద్, దామర్తి రమేష్, నాళం కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



గుంటూరు మెడికల్: జనచైతన్య గ్రూపు సంస్థల అధినేత మాదల భాస్కరరావు, మాదల శకుంతల జ్ఞాపకార్థం స్థానిక ఎస్‌వీఎన్ కాలనీ 10వ లైన్ తారకరామానగర్‌లోని మాదల శకుంతల భాస్కర్ నర్సింగ్ కాలేజ్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మాదల రత్నగిరిబాబు, మాదల చైతన్య, మాదల శ్రీరామ్‌భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్యశిబిరంలో పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి వైద్యులు, చంద్ర హాస్పిటల్స్, ప్రైమ్‌కేర్ కార్డియాక్, ఆధునిక మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మల్టీ స్పెషాలిటీ క్లీనిక్, హైమా హాస్పిటల్‌కు చెందిన వైద్యులు ఉచితంగా రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ పాటిబండ్ల శివాజీ, షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ మాదల పూజ, కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ ఆరె కార్తిక్, గైనకాలజిస్ట్ డాక్టర్ చేకూరి సింధు, డాక్టర్ కడియాల శిల్ప, డాక్టర్ పీఎస్ఎస్ శ్రీరామ్ తదితరులు వైద్య శిబిరంలో పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో 0863–2224202 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను కౌన్సిల్ హాల్‌లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పొట్టిశ్రీరాములు చిరస్మరణీయుడు



లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం పొట్టిశ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సభ్యులు డాక్టర్ ఆర్.రామచంద్రరావు, జె.ఆర్.నాయుడు, కేశవరెడ్డి పాల్గొన్నారు. చదరంగంలో భారత్ కీర్తి పతాకను ఎగరేసిన గ్రాండ్ మాస్టర్ బొమ్మరాజు గుకేష్‌కు అవగాహన సంస్థ తరుపున అభినందలు తెలిపారు.

నెహ్రూనగర్: భాషాప్రయుక్త రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజలకు చిరస్మరణీయులని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఈఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయంలో అమరజీవికి నివాళి..

గుంటూరు ఎడ్యుకేషన్: అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం డీఈవో కార్యాలయంలో ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కార్యాలయ సూపరింటెండెంట్ జగదీష్ అగర్వాల్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ ఐటీ సెల్ సిబ్బంది ఆర్‌వీ సుబ్బారావు, సీహెచ్ శ్రీనివాసరావు, నాయుడు బాబు, గోపీచంద్ పాల్గొన్నారు. .

అలరించిన సుమధుర సంగీత విభావరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం కళాంజలి(గుంటూరు) ఆధ్వర్యంలో సుమధుర సంగీత విభావరి నిర్వహించారు. గాయనీ గాయకులు ఎం.సత్యవర్ధన్, టి.సుధీర్, ఎ.సాంబశివరావు, టి.రమేష్, పి.గాయత్రిలు గాత్ర ధారణతో అనాటి సినీ, భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. కీబోర్డుపై రవిబాబు, తబలపై వెంకట్, ప్యాడ్స్‌పై ఈశ్వర్ వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య, జాస్తి వీరాంజనేయులు, మేకల రవీంద్రబాబు, బి.జమదగ్ని, శివదానం సాంబశివరావు పాల్గొనగా ఈదర శ్రీనివాసరావు, ముత్యాల వెంకటరావును సత్కరించారు.

వెల్ఫేర్ సెంటర్‌లో వాకింగ్ ట్రాక్‌ను వెంటనే చేపట్టాలి



కాకుమాను వారి తోట వెల్ఫేర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

లక్ష్మీపురం: కాకుమాను వారి తోట వెల్ఫేర్ సెంటర్‌లో 14 ఎకరాల 80 సెంట్లు నిరుపయోగంగా ఉందని, ఈ స్థలంలో వాకింగ్ ట్రాక్‌తో పాటు చుట్టుపక్కల వారి కోసం ప్రభుత్వ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కె.మాల్యాద్రి డిమాండ్ చేశారు. కాకుమాను వారి తోట వెల్ఫేర్ సెంటర్‌లో ఆదివారం స్థానిక పార్టీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాలమైన ఖాళీ స్థలం చుట్టు పక్కల పది డివిజన్‌లలో స్థానికుల అభ్యర్థన మేరకు డివిజన్ కార్పొరేటర్ భారతి కౌన్సిల్ సమావేశంలో వాకింగ్ ట్రాక్ కోరడంతో కమిషనర్ అంగీకరించారని గుర్తు చేశారు. కూటమి, ప్రభుత్వం హాస్పిటల్ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని చుట్టూ ఉన్న స్థలంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు త్వరతగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 48వ డివిజన్ సీపీఐ కార్యదర్శి విరిగినేని వెంకటేశ్వరరావు, మామిళ్లపల్లి గురుస్వామి, సిహెచ్.వెంకటేశ్వరరావు, మేడచాని కేశవరావు సిహెచ్.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

జీఓ 143 రద్దు చేయాలి

టీఎస్‌టీయూసీ డిమాండ్



మాట్లాడుతున్న భానుమూర్తి

గుంటూరు మెడికల్: తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ టీఎస్‌టీయూసీ అనుబంధం గుంటూరు జిల్లా సర్వసభ్య సమావేశం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన ఆదివారం గుంటూరు అరండల్‌పేటలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచార్యులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. భానుమూర్తి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి వెంకటలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో గందరగోళానికి కారణమైన 143 జీఓను వెంటనే రద్దు చేయాలని కోరారు. జీఎన్ఎమ్ ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి ప్రమోషన్ ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఎల్ హెచ్‌వీ ట్రైనింగ్‌కు అనుమతి ఇవ్వాలని, క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయించాలని, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. 1207 జీవో ద్వారా తొలగించిన ఎంపీహెచ్ఏఎం ఉద్యోగులందరిని మానవతా దృక్పథంతో విధుల్లోకి తీసుకోవాలని, వెంటనే 12వ పీఆర్సీ కమిటీ వేసి ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. .

జిల్లా అధ్యక్షుడిగా అప్పారావు....

సమావేశానంతరం గుంటూరు జిల్లా తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎం.అప్పారావు, కార్యదర్శిగా టి.రామసీత, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా టి.శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎస్ఎస్ సురేష్ కుమార్, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ మహమ్మద్ సుభాని, వైస్ ప్రెసిడెంట్‌గా డి మాధవి, డి.శ్రీ లక్ష్మి, ఎం.నిర్మల జ్యోతి, అనూష, జాయింట్ సెక్రెటరీగా జి.కృష్ణవేణి, ఎం.సుజాత, జి.నళిని, డి.రాజ్యలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జాతీయ చిత్రలేఖనం పోటీల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్ గార్డెన్స్‌లోని క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 19వ జాతీయ చిత్రలేఖనం పోటీలు, ప్రదర్శన సమాచార పత్రాలను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఆదివారం గార్డెన్స్‌లోని తన కార్యాలయంలో బ్రోచర్ ఆవిష్కరించిన పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 16న గుంటూరు నగరంలో జరగనున్న జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీలు, ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక, చిత్రకళా నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. అకాడమీ చైర్మన్ డాక్టర్ కేవీ బాబు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనదలచిన వారు జనవరి 15లోగా తమ ఎంట్రీలను పంపాలని, వివరాలకు 98853 77653 నంబర్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వి.సోమయ్య, జిలానీ, కృష్ణ సుబ్బారావు, మధు, పీవీ రమేష్ పాల్గొన్నారు

22న సలాం నమస్తే ఫైనల్స్ పోటీలు



గుంటూరు మెడికల్: ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, వారిలో అంతర్లీనంగా దాగి ఉండే ప్రతిభను వెలికితీసేందుకు తాము పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నామని సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఫౌండర్ డాక్టర్ షేక్ షమా సుల్తానా అన్నారు. సలాం నమస్తే సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు పొన్నూరు రోడ్డులోని ఎస్ కన్వెన్షన్ హాల్లో గుంటూరు ఘాట్ టాలెంట్ షో పోటీలు నిర్వహించారు. పాటలు, డాన్స్, స్టాండ్ అప్ కామెడీ, మ్యాజిక్ షో, మ్యూజికల్ ఇనుస్ట్రుమెంట్స్, ఫ్యాషన్ షో, మెహందీ, పోఎట్రీ, ఫన్నీ ఆర్ మెసేజ్ ఓరియంటెడ్ స్కిట్ పోటీలను నిర్వహించారు. పోటీలకు ముఖ్య అతిథిగా డాక్టర్ సలాం విచ్చేసి సెమీ ఫైనల్స్ విజేతలను అభినందించారు. సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఫౌండర్ డాక్టర్ షమా సుల్తానా మీడియాతో మాట్లాడుతూ గుంటూరు గాట్ టాలెంట్ షో ఆదివారంతో సెమీఫైనల్స్‌ను పూర్తి చేశామని తెలిపారు. ఈనెల 22న గుంటూరు పొన్నూరు రోడ్డులోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఫైనల్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫైనల్స్ విజేతలకు ఈ నెల 26న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన్ మందిరంలో బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ కరీం, మేనేజర్ నాగేశ్వరావు, కోవిడ్ ఫైటర్స్ అల్లాబక్షు నూర్ ఖాన్ పాల్గొన్నారు.